




మహిళల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్

మెప్మాలో సభ్యులుగా ఉన్న మహిళల జీవనోపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం పలు రకాల చర్యలు చేపడుతుందని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి లీలారాణి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మెప్మా కార్యాలయంలో మెప్మా పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెప్మా పోస్టర్లో ఎల్ హెచ్ పి సెల్ పై క్లిక్ చేయగానే 50 రకాల యూనిట్లు కనిపిస్తాయని యూనిట్ ఏర్పాటుకు అయ్యే పెట్టుబడి వ్యయంతో పాటు ప్రాజెక్టు వివరాలు అర్హతలు తదితర వివరాలు అందులోనే ఉంటాయన్నారు. మెప్మా సభ్యులు బ్యాంకు రుణం కావాలంటే అదే పోస్టర్లో దరఖాస్తు చేసే వెసులుబాటు కల్పించామని తెలిపారు. దరఖాస్తులను మెప్మా రిసోర్స్ పర్సన్లు కమ్యూనిటీ ఆర్గనైజర్లు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని సభ్యులను ఎంపిక చేసుకున్న యూనిట్లో ఆదాయం వస్తుందా రాదా అనేది క్షుణ్ణంగా పరిశీలన చేసి అర్హత దరఖాస్తులను బ్యాంకులకు ఆన్లైన్ లో పంపేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ స్వయం సహాయక సంఘాల సభ్యులు వినియోగించుకోవాలని తెలిపారు.



పోస్టర్ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

11,12 తేదీల్లో సిఐటియు జిల్లా మహాసభలు

- ఎస్ఎల్వి లే అవుట్లో భారీ బహిరంగ సభ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు: ఈ నెల 11,12 తేదీల్లో రెండ్రోజులపాటు తోటపల్లిగూడూరు మండలం, నరుకూరులో రెండు రోజుల పాటు సిఐటియు జిల్లా 12వ మహాసభలు నిర్వహించనున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.వి.వి ప్రసాద్, కె.అజయ్కుమార్లు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి టి.వి.వి. ప్రసాద్, కె.అజయ్కుమార్లు మాట్లాడుతూ ప్రతి మూడు సంవత్సరాలు ఒక సారి సిఐటియు నిర్మాణంలో భాగంగా మండల మహాసభల దగ్గర నుండి జిల్లా, రాష్ట్రం, ఆల్ ఇండియా మహాసభలు నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తున్నదన్నారు. అందులో భాగంగా నిర్వహించనున్న సిఐటియు జిల్లా మహాసభల్లో కార్మికులు , మధ్యతరగతి ఉద్యోగులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు చర్చలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల పునర్విభజన అయిన అనంతరం పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ప్రాంతమంతా తిరుపతి జిల్లా పరిధిలోకి వెళ్ళిపోయిందన్నారు. ఒకప్పుడు పారిశ్రామిక జిల్లాగా ఉన్న ప్రాంతం ప్రస్తుతం మెట్టప్రాంత జిల్లాగా మారిపోయిందన్నారు. రామాయపట్నం పోర్టు పనులు నత్తనడకన సాగుతున్నాయని, అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు పోర్టు నిర్మాణానికి అవసరమైన మేరకు నిధులు విడుదల చేయడంలో, నిర్వాసితుల సమస్యలకు పరిష్కారం చూపించడంలో పూర్తి వైఫల్యం చెందుతున్నాయన్నారు. ఇఫ్కో సెజ్కు గడిచిన 21 సంవత్సరాల క్రితం 2 వేల 700 ఎకరాల భూమిని 7 గ్రామాలకు చెందిన రైతుల నుంచి స్వాధీనం చేసుకొని నేటికి పూర్తి స్థాయిలో పరిశ్రమలు స్థాపనకు ప్రభుత్వం కృషి చేయకపోగా ఒకే ఒక్క పరిశ్రమతో కాలయాపన చేయడం దారుణమన్నారు. గడిచిన 7,8, సంవత్సరాల నుంచి దగదర్తి మండలంలో విమానాశ్రయం స్థాపన పేరుతో ప్రకటనలకే ప్రభుత్వాలు పరిమితం చేస్తున్నాయే తప్ప ఆ దిశగా అడుగులు వేసిన దాఖలాలు లేవన్నారు. ఒకప్పుడు కళకళలాడిన షుగర్ పరిశ్రమ పాలకుల అసమర్థత కారణంగా నేడు ఇసుక దిబ్బగా మారిపోయిందన్నారు. పాలకులు ఎన్నికల ప్రచారంలో మాత్రం తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే షుగర్ పరిశ్రమను తిరిగి ప్రారంభిస్తామని, కార్మికులకు, రైతాంగానికి మేలు చేస్తామంటూ ఆర్భాటంగా హామీలు చేస్తారని, ఆచరణలో మాత్రం చేసి చూపరన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన అనంతరం మరో అడుగు ముందుకు వేసి ఆ పరిశ్రమను ఏకంగా అమ్మివేయాలని ప్రయత్నం చేస్తుందన్నారు. సమస్యలన్నింటినీ జిల్లా మహాసభల్లో చర్చలు నిర్వహించి పరిష్కారానికి ఎటువంటి పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించాలో భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకుంటామన్నారు. 11వ తేదీన బహిరంగ సభకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో సిఐటియు నాయకులు మారోబోయిన సురేష్, దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, జి.నాగేశ్వరరావు, కె.పెంచలనర్సయ్య, షేక్ రెహనాబేగం తదితరులు పాల్గొన్నారు.



బైక్ను ఢీకొన్న కారు

ఒకరు దుర్మరణం, మరో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-గుడ్లూరు రూరల్: అతి వేగంగా వచ్చిన కారు బైక్ను ఢీకొంది. దీంతో ఒకరు దుర్మరణం చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈసంఘటన రాళ్లపాడు వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు..మండలంలోని దారాగానిపాడు గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు తిరుమలశెట్టి లక్ష్మీనారాయణ, భార్గవ్, పవన్ పెళ్లపవన గుండ్లపాలెం నుంచి బైక్ పై కందుకూరుకు వెళుతున్నారు.రాళ్లపాడు సమీపంలో అదే గ్రామానికి చెందిన కార్లో హరిచంద్రనాయుడు కారును అతి వేగంగా బైక్ను ఢీకొన్నాడు. తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు (26)అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం ఇద్దరు యువకులను ఒంగోలు ఆస్పత్రికి తరలించారు. కారు నడుపుతున్న హరిచంద్రనాయుడు పరారయ్యాడు. విషయం తెలుసుకున్న గుడ్లూరు ఎస్ఐ వై వెంకట్రావు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకురావాలి

ప్రజాశక్తి-నెల్లూరు :జిల్లా జర్నలిస్టు క్రికెట్ టీమ్ రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభ చూపాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆకాంక్షించారు. అనంతపురంలో ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొననున్న క్రీడాకారులు జిల్లా జర్నలిస్టు స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపి సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ను ఆయన ఛాంబర్లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో క్రీడాస్ఫూర్తి ప్రదర్శించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సభ్యులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ టీం సభ్యులకు క్రికెట్ గ్లౌజ్లను అందించి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నరేష్, జిల్లా గౌరవాధ్యక్షులు జిటి మౌంట్ బాటన్, జిల్లా అధ్యక్షులు నంద కిషోర్, కార్యదర్శి సునీల్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యానుకు ఉరేసుకొని

ఎసిఎస్ఆర్ వైద్యకళాశాల విద్యార్థిని ఆత్మహత్య



మృతిచెందిన ఎంబిబిఎస్ విద్యార్థిని గీతాంజలి

ప్రజాశక్తి-నెల్లూరు: ఎసిఎస్ఆర్ ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న బి.గీతాంజలి అనే విద్యార్థిని మహిళా హాస్టల్ 409 గదిలో ఆత్మహత్యకు పాల్పడింది. ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం అందుకున్న దర్గామిట్ట పోలీసు స్టేషన్ సిఐ రోశయ్య తన సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. సిఐ రోశయ్య కథనం మేరకు.. నంద్యాల జిల్లా , బండి ఆత్మకూరు మండలం, సంతజూటూరు గ్రామానికి చెందిన బి.గీతాంజలి(21)ఎసిఎస్ఆర్ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం అభ్యసిస్తుంది. మెడికల్ కళాశాలకు అనుబంధం హాస్టల్లో 409 గదిలో నలుగురు విద్యార్థినులుంటారు. వీరు దసరా సెలవులకు వారి వారి స్వస్థలాలకు వెళ్లారు. శుక్రవారం అనాటమి ప్రాక్టికల్కు హాజరు కావాల్సి ఉండటంతో హిమనందని, గీతాంజలి విద్యార్థినులు ఇద్దరు మాత్రమే గురువారం రాత్రికి హాస్టల్కు వచ్చారు. ఉదయం హాస్టల్కు చెందిన క్యాంటీన్ వద్ద టిఫిన్ చేసిన ఇద్దరు విద్యార్థినులు తిరిగి హస్టల్లోని గదికి చేరుకొని ప్రాక్టికల్ పరీక్షలకు హాజరయ్యేందుకు సిద్ధమయ్యారు. ప్రాక్టీకల్స్ మొదలవుతాయని వెళ్దాం.. రా అని గీతాంజలిని హిమనందని పిలువగా నువ్వు వెళ్లు .. వెనుకనే వస్తానని సమాదానం ఇచ్చింది. ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమైనా ఆ విద్యార్థిని గైర్హాజరు కావడంతో వైద్యకళాశాల ప్రొఫెసర్, కేర్టేకర్ హాస్టల్కు విచ్చేశారు. ఆ విద్యార్థిని ఉంటే 409వ గది వద్దకు రాగా తలుపులు వేసి లోపలవైపు గడి పెట్టి ఉండటాన్ని గుర్తించారు. అనుమానం వచ్చి తలుపులు పగలగొట్టిచూడగా గీతాంజలి చున్నీతో ఫ్యాన్కు ఉరివేసుకొని మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. వెంటనే దర్గామిట్ట పోలీసు స్టేషన్కు ఫిర్యాదు చేయడంతో సమాచారం అందుకున్న పోలీసు స్టేషన్ సిఐ రోశయ్య హుటాహుటిన తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన గదికి పోలీసులు, మెడికల్ కళాశాల అధికారులు గీతాంజలి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. ఈ ఘటనపై విద్యార్థిని తల్లిదండ్రులను ప్రశ్నించగా అనారోగ్యంతో బాధపడుతుందని, హాస్పిటల్ లో చూపించి పంపించామని చెబుతున్నారన్నారు. విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన గదిని పూర్తి స్థాయిలో తాము పరిశీలించామని ఎటువంటి లెటర్లు, ఆధారాలు కనిపించడం లభ్యం కాలేదన్నారు. విద్యార్థిని తల్లిదండ్రుల సూచనల మేరకు ఫ్యాన్కు ఉరివేసుకొని ఉన్న మృత దేహాన్ని కిందకు దించి గదిలోని మంచంపై ఉంచారు. ఈ సమాచారం తెలుసుకున్న మీడియా ప్రతినిధులు ఎసిఎస్ఆర్ ప్రభుత్వ వైద్యకళాశాలకు సంబంధించిన హాస్టల్ వద్దకు చేరుకున్నారు. వైద్యవిద్యార్థులు, పోలీసులు, కళాశాల అధికారులు మీడియా ప్రతినిధులను ఎవరినీ లోనికి అనుమతించలేదు. వైద్య విద్యార్థినులు మరో అడుగు ముందుకు వేసి మీడియా ప్రతినిధులతో వాగ్వివాదానికి దిగటంతో వాతావరణం ఒక్కసారిగా వేడిక్కెంది. పోలీసులు కలుగచేసుకొని ఇరుగ్రూపులకు సర్దిచెప్పడంతో వైద్యవిద్యార్థులు అక్కడ నుంచి వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈ ఘటన పై పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడేందుకు గల అంశాలను పరిశీలించి అందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, తిరిగి ఇటువంటి ఘటనలు చోటు చేసు కోకుండా గట్టిచర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థి , డివైఎఫ్ఐ జిల్లా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మృతి చెందిన విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతామని సిఐ రోశయ్య పేర్కొన్నారు.

స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

ప్రజాశక్తి-నెల్లూరు: ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పరిశుభ్రత రంగానికి విశిష్టమైన సేవలు అందించినందుకు జిల్లాకు రాష్ట్ర స్థాయిలో రెండు, జిల్లా స్థాయిలో 48 అవార్డులు స్వీకరించ నున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా స్థాయి అవార్డు గ్రహీతలను ఈ నెల 06న జిల్లా ఇన్ఛార్జ్ మంత్రి, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించ నున్నారు.స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం కింద, పరిశుభ్రత రంగంలో విశిష్టమైన సేవలు అందించిన వారిని గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్ - 2025 ను ప్రవేశపెట్టింది. ఈ అవార్డు గ్రహీతలు ఘన వ్యర్థాలు, ద్రవ వ్యర్థాల నిర్వహణ, ప్రజా ప్రదేశాల్లో శుభ్రత, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, ఆర్ ఆర్ ఆర్ సుస్థిర పద్ధతులలో కొత్త ప్రమాణాలను నెలకొల్పారు. దీని ఉద్దేశ్యం శానిటేషన్ కార్యకలాపాలలో విశిష్ట ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించి, అన్ని వర్గాలను స్వచ్ఛతను ఆచరణలోకి తీసుకురావడంలో ప్రోత్సహించడం.స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు 2025 రేటింగ్/ర్యాంకింగ్ స్వీయ అంచనా జిల్లా అధికారుల ధృవీకరణ, మూడో పక్ష అంచనా అనే మూడు దశల్లో ప్రభుత్వం నిర్వహించిందన్నారు. మొత్తం 1,20,057 కేంద్రాలు స్వీయ అంచనాలో పాల్గొన్నాయని, తెలిపారు. వీరిలో 62 అవార్డుల కోసం రాష్ట్ర స్థాయి పోటీకి నిలిచాయన్నారు. ఈ విజయాలు స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రఉద్యమాన్ని మరింత బలంగా ముందుకు తీసుకెళ్లే స్ఫూర్తినిస్తాయని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

ఘనంగా దసరా పారువేట ఉత్సవం..

ప్రజాశక్తి-కందుకూరు: కందుకూరులో శ్రీఅంకమ్మ తల్లి పారువేట కార్యక్రమం భక్తుల కోలాహలం నడుమ కన్నుల పండుగగా, అత్యద్భుతంగా ముగిసింది. గురువారం సాయంత్రం కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

సాగునీటి వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-నెల్లూరు :జిల్లాలో సాగునీటి వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ వారి చాంబర్లో జిల్లాలో రిజర్వాయర్లు, చెరువుల్లో సాగునీటి నిల్వలు, ఇరిగేషన్ పనుల మరమ్మతులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సోమశిల, కండలేరు జలాశయాల్లో నీటి నిల్వలు సమృద్ధిగా ఉన్నందున అన్ని మేజర్, మైనర్ చెరువులను 50 శాతానికి పైగా నీటితో నింపాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. భవిష్యత్ అవసరాల దష్ట్యా భూగర్భజలాలు పెరిగేందుకు చెరువులను నీటితో నింపాలన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల మెయింటెనెన్స్కు సంబంధించి చేపట్టాల్సిన పనులకు వెంటనే నిధులు మంజూరు చేస్తామన్నారు. సమావేశంలో ఇరిగేషన్, సోమశిల ప్రాజెక్టు ఎస్ఈలు దేశ్నాయక్, వెంకటరమణారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, డ్వామా పీడీ గంగాభవాని, ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, ఫిషరీస్ జెడి శాంతి, ఇరిగేషన్శాఖ అధికారులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగహాన్ని తగుల బెట్టడం దుర్మార్గం

ప్రజాశక్తి-కందుకూరు :చిత్తూరు జిల్లా వెదురు కుప్పం మండలం దేవళం పేట గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ బి ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని తగులబెట్టడం అత్యంత హేయమైన చర్య అని అఖిల భారత మాలసంఘాల జెఎసి అధ్యక్షుడు పాలేటి కోటేశ్వరరావు అన్నారు. రాజ్యాంగ నిర్మాత విగ్రహాన్ని తగలబెట్టడం అంటే అత్యంత పవిత్రమైన భారత రాజ్యాంగాన్ని తగలబెట్టడం దుర్మార్గమన్నారు.అంబేద్కర్ విగ్రహాన్ని తగులబెట్టిన కుల మత గూండాలను తక్షణమే అరెస్ట్ చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ద్వారా కఠినంగా శిక్షించాలని అఖిలభారత మాలసంఘాల జేఏసీ గౌరవ అధ్యక్షులు పాలేటీ. కోటేశ్వరావు, మాల మహానాడు రాష్ట్ర కమిటీ, మాల ఉద్యోగుల సంఘం కందుకూరు డివిజన్ కమిటీ నాయకులు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుడు మృతి బాధాకరం

ప్రజాశక్తి-వలేటివారిపాలెం :మండలంలోని చుండిగ్రామంలోని మోడల్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న వై. అశోక్ బాబు కందుకూరు సమీపంలోని ఓగూరు దగ్గర బుధవారం జరిగిన యాక్సిడెంట్ లో మృతిచెండడం చాలా బాధాకరమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోమినేని రవి చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా చుండి మోడల్ ప్రాథమిక పాఠశాలలో సంతాప సభ ఏర్పాటు చేసి ఉపాధ్యాయుడు అశోక్ బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోమినేని రవి చంద్రబాబు, సహచర ఉపాధ్యాయులు ఎన్. రమణయ్య, సీ హెచ్. మాదవీలత, కె.శ్రీనివాసులు, తదితరులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

నేడు 19వేల మంది ఆటో డ్రైవర్లకు నగదు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వం నేడు ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వార 19 వేల మందికి నగదు చెల్లించనున్నట్లు సర్వేపల్లి ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలో 18902 మందికి రూ.28.35 కోట్ల లబ్ధి చేకూరుతుందని తెలిపారు. వైసీపీ హయాంతో పోలిస్తే 2500 వేలమంది లబ్ధిదారులు, ఆర్థిక ప్రయోజనం కలుగుతోందన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు రిలయన్స్ రోడ్డు కూడలి నుంచి ముత్తుకూరు ఎంపీడీఓ కార్యాలయం వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఒక్కో ఆటో డ్రైవర్కు రూ.15 వేలు చొప్పున ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

నేడు విద్యుత్ లేని ప్రాంతాలు ఇవే..

ప్రజాశక్తి-కందుకూరు: టౌన్ లోని ఓవిరోడ్లో రోడ్డు వైండింగ్ వర్క్స్ జరుగుతున్నందువలన 11 కెవి ఎంఆర్ఓ ఆఫీస్ ఫీడర్ నందు ఉదయము9:30 నుండి మధ్యాహ్నము4:00 వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడుననిఅసిస్టెంట్ ఇంజనీర్ టి నరసింహం తెలిపారు. కావున ఈ ఫీడర్ పరిధిలో ఉన్నటువంటి సుల్తాన్ మొహిద్దిన్ హాస్పిటల్ ఏరియా, సంతోష్ నగర్, మక్కా మసీదు ఏరియా, ఎమ్మార్వో ఆఫీస్ ఏరియా, బూడిద పాలెం, పాత బ్యాంకు బజారు, కోట కట్ట వీధి,అన్నా క్యాంటీన్ ఏరియా పెద్ద బజార్ లోని కొంత భాగంలోని విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖ వారికి సహకరించాలని కోరారు.

రూ.200 కోట్లు నష్టపోయిన రైతాంగం

ప్రజాశక్తి-నెల్లూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించడం వల్ల జిల్లా రైతాంగం దాదాపుగా రూ.200 కోట్లు నష్టపోయారని ఏపి రైతు సంఘం జిల్లా నాయకత్వం పేర్కొంది. శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాల విషయమై సివిల్ సప్లయిస్ డిఎంఒను ఏపి రైతు సంఘం నాయకులు కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరవాలని రైతు సంఘాలు డిమాండ్ చేయడంతో ప్రభుత్వం ఆలస్యంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిందని, ఈ నేపథ్యంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే సమయంలో తేమ శాతం, గోతాలు, ఇలా అనేక రకాల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా నిబంధనలు సడలించాలని విజ్ఞప్తి చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం ఆలస్యం కావడంతో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే రూ. 5 వేలు తగ్గించి రైతులు 80 శాతం ధాన్యాన్ని రూ.13 వేల నుంచి రూ.14 వేలకు అమ్ముకోవాల్సి వచ్చిందన్నారు. అందువల్ల రైతాంగం ఇప్పటి వరకు రూ.200 కోట్ల వరకు నష్టపోయారన్నారు. కేంద్రాలు ఆలస్యంగా అయినా తెరవడం మంచిదని, తేమ, గోతాలు వంటి నిబంధనలను సడలించి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.శ్రీరాములు, మూలి వెంగయ్య, సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్, సహాయ కార్యదర్శి లక్కు ప్రసాద్, ఉపాధ్యక్షులు జనార్థన్, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సిబ్బందికి అభినందన

ప్రజాశక్తి-వలేటివారిపాలెం : మండల కేంద్రమైన వలేటివారిపాలెం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లో ఒక రోజులోనే ఒక కోటి రూపాయలు బంగారు రుణాలు ఇవ్వడంలో బ్యాంక్ మేనేజర్ అకౌంటెంట్ ప్రదీప్ ఫీల్డ్ ఆఫీసర్ చరణ్ క్యాష్ ఆఫీసర్ నాగార్జున లను రీజనల్ మేనేజర్ అప్పలరాజు అభినందించారు. శుక్రవారం బ్యాంక్ ఆవరణంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతు ఆర్ఎం అప్పలరాజు ఎస్బిఐ ఖాతాదారులకు ఇతర రుణాలతో పాటు బంగారు రుణాలను త్వరితగతిన ఇచ్చి ఖాతాదారులకు సేవలు అందించడం జరుగుతుందన్నారు. వలేటివారిపాలెం ఎస్బి మేనేజర్ తో పాటు సిబ్బంది ఖాతాదారులకు సేవలు అందించడం లో కొనియాడినారు బ్యాంకు ద్వారా అందించే సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు బ్యాంకు మేనేజర్ నాగ ఆంజనేయులు మేనేజర్ గా బాధ్యతలు చేపట్టిన నుండి ఖాతాదారులకు రుణాలు ఇవ్వడంతో పాటు మెరుగైన సేవలు అందిస్తున్నారని, ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో సాధు చెన్నకేశవులు, బాలాజీ, రసూల్, ఖాతాదారులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న దృశ్యం

రామలింగాపురం అండర్ బ్రిడ్జి ప్రారంభం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిది :నెల్లూరు నగరంలోని రామలింగాపురం అండర్ బ్రిడ్జి శుక్రవారం ప్రారంభించారు.కోటి, 17 లక్షల రూపాయలతో నిర్మించిన రామలింగాపురం అండర్ బ్రిడ్జి రోడ్డు, ఫుట్ పాత్, కల్వర్ట్ నిర్మాణాలను పుట్టంరెడ్డి సహర్ష రెడ్డి చేత, ప్రారంభించిన కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. ప్రారంబిం చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, స్థానిక కార్పొరేటర్ మారంరెడ్డి జ్యోతి ప్రియ హాజరయ్యారు. అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని నెల్లూరు రూరల్ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతామని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి.అన్నారు. మంత్రి పొంగూరు నారాయణ నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నెల్లూరు రూరల్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, జనసేన నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, సుందర రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్రెడ్డి

కూటమి పాలనంతా అవినీతే:కాకాణి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి :కూటమి ప్రభుత్వంలో అవినీతి,అక్రమాలు తప్ప ఏమీ లేదని మాజీ మంత్రి , వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్రెడ్డి అన్నారు. శుక్రవారం సర్వేపల్లి నియోజకవర్గం, పొదలకూరు మండలం, కళ్యాణపురం గ్రామంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలు తప్ప, అభివృద్ధి, సంక్షేమ జాడ కనిపించడం లేదన్నారు. . సూపర్ సిక్స్ పథకాలు, సూపర్ ఫ్లాప్ అయినా, సూపర్ హిట్ అని చెప్పుకోవడం కూటమినేతలకే చెల్లిందన్నారు.



జిఎస్టి 2.0 సంస్కరణపై అవగాహన

ప్రజాశక్తి-కందుకూరు: కేంద్రం ప్రభుత్వం దేశంలోని అన్ని రంగాలకు ఒక 'సూపర్ గిఫ్ట్'గా జీఎస్టీ 2.0 సంస్కరణలను తీసుకొచ్చిందని కందుకూరు శాసన సభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు.ఈ సంస్కరణల వల్ల ప్రతి కుటుంబానికీ సగటున రూ.15వేలు వరకు ఆదా అవుతుందని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కొనసాగుతున్న కూటమి ప్రభుత్వ పాలనలో, జీఎస్టీ 2.0 తో ధరలు తగ్గి సామాన్య ప్రజలకు ఊరటనిచ్చిందని వివరించారు.అవగాహన ర్యాలీ విజయవంతంజీఎస్టీ 2.0 ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో భాగంగా పట్టణంలో భారీ ర్యాలీ జరిగింది.శ్రీ అంకమ్మ తల్లి దేవస్థానం వద్దనుండి పోస్ట్ ఆఫీస్ సెంటర్ వరకు సాగిన ఈ ర్యాలీలో కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ముందుగా స్థానిక వ్యాపారులకు, ప్రజలకు, దుకాణదారులకు జీఎస్టీ 2.0 వల్ల కలిగే లాభాలను కరపత్రాల రూపంలో పంపిణీ చేసి, స్వయంగా వివరణ ఇచ్చారు..కార్యక్రమంలో కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, జనిగర్ల నాగరాజు, పూరిమెట్ల గురునాథం, రాచగర్ల సుబ్బారావు, ఘట్టమనేని హరిబాబు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు ఎంతో మేలు చేకూరిందని డీప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ సుజాత భాయ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఇస్కపాలెం పంచాయతీలో జిఎస్టీ సంస్కరణలపై ప్రజల కు అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ముత్యాలు శ్రీనివాసులు, తలమంచి నాగేశ్వర్ రావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉలవపాడు: రైతు భరోసా కేంద్రం 3 లో కూటమి ప్రభుత్వం నూతనంగా మారిన జి. ఎస్.టి స్లాబ్, సూపర్ జిఎస్టి- సూపర్ సేవింగ్స్ గురించి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో మండల వ్యవసాయ అధికారి డి. విజయ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

ప్రజాశక్తి-కందుకూరు: ప్రాజెక్టు ఎ సెక్టార్ లోని 4వతరగతి ఎంప్లాయీస్ కాలనీ అంగన్వాడీ కేంద్రం లో సిడిపిఒ ఉషారాణి ఆదే శాల మేరకు సూపర్ వైజర్ ఎస్కె షకీలా బేగం పౌష్టికా హార మాసొత్సవాలు జరి పారు. ఈ కార్యక్రమంలో యా క్టివిటీ పురుషుల భాగ స్వామ్యం అనే అంశం పై పురుషులందరినీ సమావేశ పరచి పౌష్టికాహారమ్ గురించి,కుటుంబంలో అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే పురుషుల ప్రాధాన్యత ఎంతైనా ఉందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కేశవకుమారి ,జరీనా ,కరీమ ,ధనలక్ష్మి ,దివ్యా ధనలక్ష్మి ,సుశీల పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్నదృశ్యం

ఉపాధ్యాయుడు అశోక్కు నివాళులు

ప్రజాశక్తి-కందుకూరు :రహదారి ప్రమాదంలో మతి చెందిన ఎస్ టి యు జిల్లా అధ్యక్షులు ,ఉపాధ్యాయ సంఘ నేత అశోక్ కి సిపిఐ జాతీయ నాయకులు రావుల వెంకయ్య, జిల్లా నాయకులు దామా అంకయ్య, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు, నాయకులు ఆనందమోహన్ లు అశోక్ కు పూలమాలలు వేసి శుక్రవారం నివాళులు అర్పించారు. అశోక్ గురువారం ఉదయం కందుకూరు మండలం ఓగూరు గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ కష్టపడి విద్య అభ్యసించి కావలి జవహర్ భారతి కళాశాలలో ఉన్నత విద్య అభ్యసించి 2005వ సంవత్సరంలో ఉపాధ్యాయునిగా బాధ్యతలు స్వీకరించి నిరంతరం విద్యార్థులను తీర్చిదిద్దటంలో ముందున్నారన్నారు. 2014లో ఆదినారాయణ నేతత్వంలో ఎస్ టి యు లో చేరి నాటి నుండి ఎస్టీయూ బలోపేతానికి నిరంతరం శ్రమించారని కొనియాడారు. ఆయన లేని లోటు ఉద్యమానికి తీరని లోటని అన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు.

సమస్యలు క్షేత్రస్థాయిలో పరిశీలన

ప్రజాశక్తి-నెల్లూరు కార్పొరేషన్: నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుకున్న సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు స్థానిక 41 వ డివిజన్ మనుమ సిద్ధి నగర్ ప్రాంతంలో పర్యటించారు. డివిజన్ పరిధిలో జరిగిన సివిల్ వర్క్స్, డ్రెయిన్ కాలువలు, సి.సి రోడ్ల నిర్మాణం పనులను కమిషనర్ తనిఖీ చేశారు. స్థానికంగా నిర్మిస్తున్న నూతన భవనాలకు సంబంధించిన పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులను తనిఖీ చేశారు. భవనాలకు సంబంధించిన అసెస్మెంట్ డిమాండ్లతో భవనాల కొలతలను చెక్ చేశారు. కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, రెవెన్యూ విభాగాల అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.85,116 ధర పలికిన లడ్డు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :మండలంలోని వరిగొండ దేవలాలమిట్ట ప్రాంతంలో వెలసిన శ్రీజ్వాలాముఖి అమ్మవారి ఆలయం లో విజదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని చైర్పర్స న్ కోడూరు రాజేశ్వరి, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈ ఓ తాతా శ్రీనివాసులు ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు జరిగిన విషయం తెలిసిందే. ఈ సంద ర్భంగా ఈ నెల 2వ తేదీన శ్రీ జ్వాలాముఖి అమ్మవారి దే వస్థానంలో ఏర్పాటు చేసిన లడ్డు ధర 85,116 రూపా యలు పలికింది. పోటాపోటీగా జరిగిన వేలం పాటలో ఈ లడ్డును నెల్లూరు నగరానికి చెందిన కోనంగి నాగేంద్ర కుమార్ 85,116 రూపాయల కు దక్కించుకొన్నారు.

అంబేద్కర్ భవనంలో పరిశీలన

ప్రజాశక్తి-నెల్లూరు కార్పొరేషన్: కలెక్టర్ ఆదేశాలతో నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ. నందన్ స్థానిక 34వ డివిజన్ కొండాయపాలెం గేట్ కూడలి సమీపంలోని అంబేద్కర్ భవన్ ప్రాంగణాన్ని అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ హజరతయ్యతో కలిసి పరిశీలించారు. అంబేద్కర్ భవన్ లో సభలు, సమావేశాలు, శుభకార్యాలు జరుపుకోవడానికి ప్రస్తుతం ఉన్న మౌలిక వసతులను కమిషనర్ తనిఖీ చేశారు. ప్రాంగణంలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, మరుగుదొడ్ల నిర్వహణ తదితర అంశాలపై ప్రణాళికలను రూపొందించాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు: దైవచింతనతో మానసిక ప్రశాంతత పెంపొందుతుందని సర్వేపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సోమి రెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కోడూరు పాతపాళెంలో శుక్రవారం దేవస్థానానికి శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్ర మంలో చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒ క్కరూ దైవచింతన కలిగి ఉండాలన్నారు. తద్వారా మా నసిక ప్ర శాంతత పెంపొందుతుందని తెలిపారు. దాంతో ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ జీవితంలో విజయం సాధించాలని కోరుకుంటారన్నారు. కార్యక్రమంలో టీ డీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేం ద్ర, సోమిరెడ్డి శ్రీనివా సులు రెడ్డి, సొ సైటీ చైర్మన్ సన్నారెడ్డి సురేష్ రెడ్డి, టీడీపీ నాయకులు వీరబోయిన గంగాధర్, మత్స్యకార సంఘం నాయ కులు ఆవుల మునిరత్నం, మత్స్యకారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వినియోగదారులకు కరెంటు బిల్లులోనే తగ్గింపు

ప్రజాశక్తి-నెల్లూరు: ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులటరీ కమీషన్ వారి ఆదేశాలు ప్రకారం జిల్లాలోని విద్యుత్ వినియోగదారులకు నవంబర్ నెల నుండి మీ కరెంటు బిల్లులోనే ట్రూ డౌన్ చార్జెస్ జమ అవుతాయని జిల్లా సూపరింటెండింగ్ ఇంజినీర్ కె.రాఘవేంద్రం పేర్కొన్నారు. శుక్రవారం ఈ మేరకు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. పత్రికలకు డివిజన్ ల వారిగా వివరాలు వెల్లడించారు. ఆత్మకూరు డివిజన్కు 2 కోట్ల 25 లక్షలు, కావలి డివిజన్ కు 4 కోట్ల 57 లక్షలు, కోవూరు డివిజన్ 6 కోట్ల 8 లక్షలు, రూరల్ డివిజన్ కు 10 కోట్ల 80 లక్షలు, టౌన్ డివిజన్ కు 8 కోట్ల 25 లక్షలు మొత్తంగా జిల్లాకు రూ.32 కోట్ల 24 లక్షలు వినియోగదారుల బిల్లుల్లో జమ చేయనున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఆశా వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ

ఆశాలకు కనీస వేతనమివ్వాలి

- ఆశా వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ

ప్రజాశక్తి-నెల్లూరు

ఆశాలకు కనీస వేతనం అందజేయాలని, పని భద్రత కల్పించాలని, వారాంతపు, మెడికల్ ఇలా అన్నిరకాల సెలవులు మంజూరు చేయాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ విలేకర్ల సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలల్లో ఎఎన్ఎం ఖాళీలను భర్తీ చేసే సమయంలో ఆశా వర్కర్స్‌గా పనిచేస్తూ ఎఎన్ఎం కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఆశా నియామకాలు ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. ఆశా వర్కర్లకు ఎటువంటి సంబంధం లేని పనులు అధికారులు చేయించడం సరికాదన్నారు. ఆశాలకు ఎటువంటి సంబంధం లేని పనులు చేయించే జిల్లా అధికారులు, నోడల్ ఆఫీసర్లు ఎవరైనా ప్రభుత్వపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 7వ తేదీన ఆశా డే సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లు ఇబ్బందులు పలు సమస్యలపై ప్రభుత్వానికి నిరసన తెలియజేస్తూ, తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రాలు అందజేయాలని పిలుపునిచ్చారు. ఐటీవిల జాయింట్ కమిటీ సమావేశాలు నిర్వహించిన సమయంలో డిఎంహెచ్ఒ ఆశాలకు సంబంధం లేని పనులు చెప్పమని,అదే విధంగా ఒపి విధులు నిర్వహించాలని కోరమని ప్రకటించారన్నారు. అయినప్పటికీ క్రింది స్థాయి అధికారులు మాత్రం ఆయన విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆశాలు తమ సమస్యల సాధన కోసం ఈ నెల 7వ తేదీన జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం.విజయలక్ష్మి, నాయకులు కె.లక్ష్మి, డి.మేరీ, జి.వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పనిభారం తగ్గించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

కార్మికులకు పని గంటల భారంను తగ్గించి 8గంటల పని కొనసాగించి కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని జిల్లా కార్యదర్శి షేక్ రెహనాబేగం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సుందరయ్య భవనంలో సిఐటియు మండల మూడో మహాసభ జి.నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం ఈ మహాసభకు జిల్లా సిఐటియు జిల్లా కార్యదర్శి షేక్ రెహనాబేగం పాల్గొని మాట్లాడుతూ సిఐటియు జిల్లా మహాసభలు నెల్లూరులో 11వ, 12వ తేదీలలో నరుకూరు గ్రామంలో జరుగుతున్నాయని ఈ మహాసభకు ముందు అన్ని మండలాల సిఐటియు మహాసభలు నిర్వహించుకుని నూతన కమిటీలు ఆ మహాసభకు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా కార్మికులకు 8గంటల పనివిధానం కొనసాగించాలని కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని అంగన్‌వాడీలకు సంబంధించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రకరకాల రంగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని వేతనంతో కూడిన మెడికల్ లీవులు ఇవ్వాలని మహిళలకు రాత్రిపూట డ్యూటీలు వేయడం రద్దు చేయాలని ప్రజలు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ఎక్కడ స్మార్ట్ మీటర్లు బిగించిన పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని సిఐటియుగా హెచ్చరించాలన్నారు. పాత పద్ధతిలోనే కరెంటు బిల్లులు కరెంట్ మీటర్లు ఉండాలని సబ్సిడీలు కొనసాగించాలని భోజన కార్మికులకు నెలనెల బిల్లులు వేతనాలు వేయాలని మెనూ బిల్లు రూ.20లకు పెంచాలని కనీస వేతనం రూ.10వేలు ఇవ్వాలని ఈ మహాసభలో కార్మికుల తరఫున డిమాండ్ చేశామన్నారు. అనంతరం ఉదయగిరి మండల సిఐటియు కమిటీ 15 మందితో ఎన్నుకున్నారు. ఈ కమిటీకి కన్వీనర్‌గా ఎస్.కె.నాయబ్ రసూల్, కోకన్వీనర్‌గా జి.నాగేశ్వరరావు, కోశాధికారిగా జి.ప్రమీలమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మహాసభలో రైతుసంఘం నాయకులు కాకు వెంకటయ్య, విద్యుత్ శాఖ విజయరామిరెడ్డి, మహిళా సంఘం మాదాల కామాక్షమ్మ, సిఐటియు కోడె రమణయ్య, ఈ మహాసభలో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులు, పంచాయతీ కార్మికులు, భవన కార్మికులు, అంగన్‌వాడీ, ఆశా, విఆర్ఎలు, ఆర్‌టిసి, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్, పోస్టల్ ఎంప్లాయిస్, ఆటో, ట్రాలీ, భవనం రంగాల కార్మికులు పాల్గొన్నారు.


నూతనంగా ఎన్నికైన కమిటీ


మాట్లాడుతున్న హాస్పిటల్ సూపరింటెండెంట్ శేషారత్నం

ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు స్వచ్ఛ హాస్పిటల్ అవార్డు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ప్రకటించిన అవార్డుల్లో స్వచ్ఛ హాస్పిటల్‌గా ఆత్మకూరు జిల్లావైద్యశాల ఎంపికైనట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ శేషారత్నం శుక్రవారం ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర టీమ్ పరిశీలన చేసి పారిశుధ్యం, శానిటైజేషన్, బిపి, ఒపి ఇతర విభాగాలు అన్ని పరిశీలించారని, స్వచ్ఛ ఆంధ్ర టీం పరిశీలించి బెస్ట్ స్వచ్ఛ హాస్పిటల్‌గా ఆత్మకూరు జిల్లా ఆసుపత్రిని ఎంపిక చేశారన్నారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సూపరింటెండెంట్ శేషారత్నం తనకు సహకరించిన సిబ్బంది అందరికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.


పరికరాలను పరిశీలిస్తున్న సర్వేపల్లి ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

రాయితీతో పేదలకు హెల్త్ కార్డులు

ప్రజాశక్తి-ముత్తుకూరు

30 శాతం రాయితీ కల్పిస్తూ 300 మంది పేదలకు తొలి విడతలో వైద్య సాయం చేసే విధంగా ఆదిత్య హాస్పిటల్ యాజమాన్యం హెల్త్‌కార్డులు అందజేయడం ప్రశంసనీయమని సర్వేపల్లి ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రం చలివేంద్రం రోడ్డు మార్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈ హాస్పిటల్‌ను శుక్రవారం ఎంఎల్ఎ సోమిరెడ్డి ప్రారంభించారు. హాస్పిటల్ మేనేజ్మెంట్ విభాగం జి భగవాన్ ఎంఎల్ఎకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సముదాయంలో ఎక్స్‌రే, ఐకేర్, రోగుల వార్డు గదులు, ఉచిత అంబులెన్స్ సౌకర్యంతో పాటు పలు విభాగాలను ఎంఎల్ఎ ప్రారంభోత్సవం చేశారు. ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ బిందుమాధురి హాస్పిటల్ వివరాలను ఎంఎల్ఎకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆత్మీయ సన్మానించారు. అనంతరం ఎంఎల్ఎ సోమిరెడ్డి మాట్లాడారు. పేదలకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సౌకర్యం కల్పించడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. హెల్త్ కార్డులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్, స్థానిక సీనియర్ నాయకులు ఈదూరు రామ్మోహన్ రెడ్డి, కంటి వైద్య విభాగం నిపుణులు అనిల్, కాన్పులు గర్భకోశ వ్యాధి నిపుణులు డాక్టర్ ఝాన్సీరెడ్డి, ప్రభుత్వ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వ్య.కా.సం. జిల్లా మహాసభ జయప్రదానికి పిలుపు



మాట్లాడుతున్న వ్యకాసం నేతలు

ప్రజాశక్తి-కొడవలూరు

అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 20వ మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం నార్త్ రాజుపాలెం నూతనంగా నిర్మించిన సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి జొన్నలగడ్డ వెంకమరాజు, మంగళ పుల్లయ్య మాట్లాడుతూ భూమి కోసం పని కోసం గౌరవం కోసం వ్యవసాయ కార్మిక సంఘం ఏర్పడిందన్నారు. వ్యవసాయ కార్మికుల కోసం సమగ్ర చట్టం తీసుకురావాలన్నారు. ఈ చట్టం ద్వారా వ్యవసాయ కార్మికులకు 60 సంవత్సరాలు దాటిన వారికి పింఛన్ ఇవ్వాలని కోరారు. ఇదే చట్టాన్ని కేరళ ప్రభుత్వం అమలు చేస్తుందని ఆయన తెలిపారు. వ్యవసాయ రంగంలో అనేక మార్పులు రావడంతో వ్యవసాయ కార్మికులకు పని దినాలు తగ్గాయన్నారు. దాంతో వ్యవసాయ కూలీలు పనులు లేక వలసలు పోతున్నారన్నారు. వామపక్షాల పోరాటంతోటే వచ్చిన ఉపాధి హామీ పథకాన్ని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. 5వ తేదీన నిర్వహిస్తున్న అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 20వ మహాసభలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యకాసం రాష్ట్ర కమిటీ సభ్యులు పోతుగుంట దేవకుమారి, వ్యకాసం రాష్ట్ర కమిటీ సభ్యులు పోతుగుంట పరుశురాం, వ్యకాసం మండల కార్యదర్శి సయ్యద్ మహబూబ్ బాషా, సిఐటియు మండల కార్యదర్శి తలారి నరసింహ, సిపిఎం నాయకులు గోనె దయాకర్, దేవదానం, జడ్డ బాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : అక్టోబర్ 5న వ్యవసాయ కార్మిక సంఘం 20వ జిల్లా మహాసభలు కొడవలూరు మండలం యల్లాయపాళెంలో జరుగుతున్నాయని మండల వ్యవసాయ కార్మిక సంఘం మండలాధ్యక్షుడు బందిల రమణయ్య, మండల కార్యదర్శి నాగులూరు వెంకటేష్ తెలిపారు. ఈ మహాసభలకు రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జొన్నలగడ్డ వెంకమ రాజు, మంగళ పుల్లయ్య పాల్గొంటారన్నారు. ఈ మూడు సంవత్సరాల కాలంలో వ్యవసాయ కార్మికుల సమస్యలపై జరిపిన పోరాటాలను సమీక్షించుకొని భవిష్యత్తులో వ్యవసాయ కార్మికుల సమస్యలపై పోరాడడానికి కార్యక్రమాన్ని రూపొందించుకుంటామన్నారు. ఉపాధి హామీ పనులు సక్రమంగా జరగాలని వ్యవసాయ కార్మిక సంఘం పెద్దఎత్తున పోరాటం చేస్తుందన్నారు. అలాగే వ్యవసాయ కార్మికులకు చేసిన కూలి పోరాటాలకు, భూ పోరాటం చేసి ప్రాణాలర్పించిన అమరులైన గాలంకి తిరుపాలు గ్రామం యల్లాయపాలెం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం 20వ మహాసభలు జరుపుకోవడం గొప్ప విశేషమన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభల సందర్భంగా జరిగే ర్యాలీ బహిరంగ సభను జయప్రదం చేయడానికి మండలంలో ఉండే వ్యవసాయ కార్మికులు పాల్గొనాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభల స్ఫూర్తితో మరింత ఉత్సాహంతో వ్యవసాయ కార్మికుల సమస్యలపై, మండలంలో భూ పోరాటాలు నిర్వహిస్తామన్నారు.



నిరసన తెలియజేస్తున్న రైతులు

రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : మండల పరిధిలోని రైతులను జిల్లా ఉన్నత అధికారులు ఆదుకొని రైతులకు 1బీ అడంగల్ వచ్చేటట్లు చేసి బ్యాంకు రుణాలు రీషెడ్యూల్ నూతన రుణాలు వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని బిజ్జంపల్లిలో ఎపి రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య పంచాయతీ రైతులతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ భూమి కలిగిన ప్రతీ రైతుకు పాస్‌బుక్, 1బి అడంగల్ వచ్చేటట్లు చేయాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు తప్పిదం వల్ల ఈ పరిస్థితి నెలకొందని, వెంటనే అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాలు పరిశీలన చేసి సమస్యలను పరిష్కారం చూపాలని కోరారు. ముఖ్యంగా రైతులు 1బి అడంగల్ రాక కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందుకోలేక బ్యాంకర్లు రుణంను రీషెడ్యూల్ చేసుకోక బ్యాంకర్లు దౌర్జన్యాలు దిగుతున్నారన్నారు. వెంటనే జిల్లా అధికారులు స్పందించి రైతు కుటుంబాలను ఆదుకోవాలన్నారు.

తక్కువ ఖర్చుతో వైద్యశిబిరం : జెవివి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: జన విజ్ఞాన వేదిక మండల శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం వారి సహకారంతో ప్రతి రెండు నెలలకోసారి నిర్వహించే సుగర్, బిపి, గుండె సంబంధిత వ్యాధుల వైద్య శిబిరం అక్టోబర్ 5వ తేదీ ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని శ్రీ షిరిడి సాయిరాం కళాశాల ప్రాంగణంలో ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు వైద్య సిబ్బంది నిర్వహిస్తారని జన విజ్ఞాన వేదిక మండల శాఖ తెలియజేంది. ఈ వైద్య శిబిరానికి నెల్లూరు జిల్లా కేంద్రంలోని రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల నుండి ప్రముఖ వైద్యులు ఎంవి రమణయ్య, మెడికవర్ హాస్పిటల్ నుండి గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ ఎం.బాలకృష్ణ హాజరవుతారని తెలిపారు. వైద్య శిబిరంకు హాజరయ్యే పేషెంట్లు పాతమందుల చీటీని (పుస్తకం) తీసుకొని రావలసిందిగా తెలిపారు. సుగర్ టెస్ట్ 1సారి చేయించుకున్న వారికి రూ.25 ఆహారం తిన్న తర్వాత రెండోసారి కూడా చేయించుకునే వారు మరో రూ.25 చెల్లించాలన్నారు. ఇన్సులిన్ ఒకటికి రూ.100 రెండు నెలలకు (సుగర్, బిపిలకు) అవసరమగు మందులు కేవలం రూ.250లకు మాత్రమే ఈ అవకాశాన్ని పట్టణ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జన విజ్ఞాన వేదిక మండల శాఖ కోరింది.

బోరుకు మరమ్మతులు



ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు పంచాయితీ అరుంధతీయపాలెం మాతమ్మ దేవాలయం పక్కన ఉన్న చేతి బోరుపంపు గత ఆరు నెలల నుండి పనిచేయక పోవడంతో స్థానికులు బోగోలు పంచాయతీ మాజీ సర్పంచ్, టిడిపి సీనియర్ నాయకులు థామస్ పాట్రిక్‌కు తెలపడంతో సంబంధిత చేతి బోరు మెకానిక్ సింహాద్రితో మాట్లాడి చేతిబోరు పంపును మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా మాజీ బోగోలు పంచాయతీ సర్పంచ్ ఫ్యాట్రిక్ మాట్లాడుతూ కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి సహకారంతో మండలంలోని పలు సమస్యలను ఒక్కోటిగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు దేవరాల తిరుపతి, మెతుకు వెంకట శేషయ్య, బుర్రి వెంకట్రావు, యువకులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన



ప్రజాశక్తి-కావలి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ కావలి పట్టణ ప్రాంతాలలో ఎల్.ఈ.డి.వ్యాన్ ద్వారా ప్రజలకు హెచ్.ఐ.వి / ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు. హెచ్.ఐ.వి/ఎయిడ్స్, క్షయ వ్యాధి సంబంధం గూర్చి, సుఖ వ్యాధులు, చికిత్స గూర్చి, కండోమ్ ఉపయోగం గూర్చి, ఎపి సాక్స్ యాప్, టోల్ ఫ్రీ నెంబర్ 1097 గూర్చి తెలుపుతూ అలానే చెడు వ్యసనాలకు, డ్రగ్స్.వాడటం వల్ల కలిగే నష్టాలు చెబుతూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సార్డ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ జె.రూత్ బేనోమి, హేమలత, నందిని, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

సబ్‌జైల్లో ఖైదీల సంక్షేమ దినోత్సవం



ప్రజాశక్తి-కావలి : కావలి సబ్ జైలులో గాంధీ జయంతి సందర్భంగా ఖైదీల సంక్షేమ దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కావలి మండల న్యాయ సేవాధికారిక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ముఖ్య అతిథిగా జూనియర్ సివిల్ జడ్జి ఇ.సుధాకర్ హాజరై చెడును వీడి, మంచి ప్రవర్తనతో నడచుకొని సమాజంలో గౌరవంగా జీవించాలని, అలాగే చెడు వ్యసనాల కు, చెడు అలవాట్లకు దూరంగా వుండాలని అక్కడ వున్న ఖైదీలకు తెలిపారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ మెంబరు ఐ.సాయిప్రసాద్, లోక్ అదాలత్ మెంబర్ ఎం.మాలకొండా రెడ్డి, జైలు సూపరింటెండెంట్ చినసుబ్బయ్య పాల్గొన్నారు.

భాస్కర్ మృతి తీరని లోటు

ప్రజాశక్తి-బిట్రగుంట

జిల్లా రైతు కార్యవర్గ సభ్యుడు కాకాణి భాస్కర్ మృతి వారి కుటుంబ సభ్యులు తీరని లోటు అని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్లూరు మాల్యాద్రి పేర్కొన్నారు. బోగోలు మండలం అక్కంరాజువారి కండ్రిక గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు, జిల్లా రైతు కార్యవర్గ సభ్యుడు కాకాణి భాస్కర్ అనారోగ్యంతో గురువారం తన నివాసంలో మృతి చెందారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్లూరి మాల్యాద్రి, బోగోలు మండల సిపిఎం సీనియర్ నాయకులు తుమ్మల వెంకయ్య, బోగోలు మండలం సిపిఎం మహిళా సీనియర్ నాయకురాలు మేరమ్మ భాస్కర్ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎం జిల్లా కమిటీ తరపున వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నామని వారి కుటుంబానికి పార్టీ అండదండలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో కడనూతల శాఖ కార్యదర్శి పోట్లూరి శ్రీనివాసులు, విశ్వనాథరావుపేట శాఖ కార్యదర్శి ఎన్ రామయ్య, సిఐటియు కార్యదర్శి చల్లా నరహరి, మండల సిఐటియు కన్వీనర్ బాదుల్లా, సిఐటియు ఉపాధ్యక్షులు ఎస్.కె.అన్వర్‌బాషా, సిపిఎం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ సమస్యకు పరిష్కారం



ప్రజాశక్తి-ఉదయగిరి : స్థానిక గ్రామపంచాయతీ పరిధిలోని కావలి రోడ్డు కాలనీలో మూడు వీధులలో గత కొన్ని రోజులుగా పంచాయతీ కొళాయి నీరు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురి కావడంతో గ్రామ పంచాయతీ సర్పంచ్ పాములూరు సామ్రాజ్యం, ఉప సర్పంచ్ ముత్తుజా హుస్సేన్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి షేక్ కరీముల్లా శరవేగంగా జెసిబి సహాయంతో మూడు రోజులు తీవ్రంగా శ్రమించి బ్లాక్ అయిన పైపు లైను గుర్తించి కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. దాంతో స్థానిక ప్రజలకు ఎటువంటి ఆటంకం లేకుండా నీటి సరఫరా సజావుగా జరిగే విధంగా చర్యలు చేపట్టడంపై హర్షం వ్యక్తం చేశారు.

రైతులకు మంచి అవకాశం

ప్రజాశక్తి-ఉదయగిరి : మండల పరిధిలోని కొండాయపాలెం స్థానిక బిట్-1 సచివాలయంలో రైతులకు తగ్గిన జిఎస్‌టిపై మండల వ్యవసాయ అధికారి విజయభాస్కర్ అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు జిఎస్‌టి 2.0 గురించి పూర్తిగా వివరించి రైతులకు పోషకాల మీద, ట్రాక్టర్, ట్రాక్టర్ పనిముట్ల మీద 7శాతం వందకు ఏడు రూపాయలు చొప్పున తగ్గిందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీజన్ ఆరంభం ముందు తగ్గడం రైతులకు మంచి ఉపయోగకరంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆటో ర్యాలీని జయప్రదం చేయండి..


మాట్లాడుతున్న ఎంఎల్ఎ కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-కావలి

'ఆటో డ్రైవర్ సేవలో' కార్యక్రమంలో భాగంగా ఆటో డ్రైవర్ ఖాతాలో రూ.15వేలు శనివారం జమ కానున్నాయని కావలి ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ విలేకరులతో మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సంక్షేమార్థం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆటో డ్రైవర్ సేవలో కార్యక్రమంలో భాగంగా కావలి నియోజకవర్గంలో 1,888మంది అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున మొత్తం రూ.2.83 కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమ కానున్నట్లు తెలిపారు. పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. నిరంతరం ప్రజలకు సేవలందిస్తున్న ఆటో డ్రైవర్లకు కొంతమేర తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో సిఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నదన్నారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఈ మొత్తం డ్రైవర్ల ఖాతాల్లో జమ కానుందన్నారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు కావలి ఎంఎల్ఎ కార్యాలయం నుండి ఆటో డ్రైవర్లతో భారీ ర్యాలీ మద్దూరుపాడు సమీపంలోని ఎస్ఎంఎకె కన్వెన్షన్ హాల్ వరకు నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్, కావలి పట్టణ టిడిపి అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, బోగోలు మండల టీడీపీ అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు, కండ్లగుంట మధుబాబు నాయుడు, ఆటో యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రవేశ పెట్టిన 'ఆటో డ్రైవర్ సేవలో' కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు పట్టణ పరిధిలోని శనివారం ఉదయం 10 గంటలకు ఆత్మకూరు పురపాలక సంఘ నెల్లూరుపాలెం నుండి మున్సిపల్ కార్యాలయం వరకు ఆటో ర్యాలీ నిర్వహిస్తారు. అనంతరం అర్హులైన ఆటో డ్రైవర్లకు గౌరవ రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామానారాయణ రెడ్డి చేతుల మీదగా చెక్కు పంపిణీ కార్యక్రమం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ తెలిపారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-దగదర్తి


మాట్లాడుతున్న తహశీల్దారు కృష్ణ

మండలంలోని రెవెన్యూకు సంబంధించి రైతులు గ్రామస్తుల ఎదుర్కొంటున్న సమస్యలను వీలైనంత తొందరగా పరిష్కరించాలంటూ తహశీల్దార్ పి.కృష్ణ అన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో విఆర్ఒలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వెలిపాడు చౌటపుత్తేడులో రీ సర్వే చేపడుతున్నట్లు వారు తెలిపారు. దానికోసంగా గ్రామాల్లో గ్రామసభ ఏర్పాటు చేయాలని సూచించారు. అంతేకాక గ్రామంలో ఉన్న ప్రతిఒక్క రైతులు పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అంతేగాక ఎస్‌సిలకు బర్రెల గ్రౌండ్ కోసం ప్రభుత్వం భూమి గుర్తించాలని సూచించారు. ప్రభుత్వం లేకున్నా ఉంటే భూమి ఇచ్చే రైతులను ఉంటే సంప్రదింపులు జరపాలన్నారు. క్యాస్ట్ ఇన్కమ్ సర్టిఫికెట్లను వీలైనంత తొందరగా ప్రజలకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రియాంక, విఆర్ఒలు బాల నాగమ్మ, సీనయ్య, దాసు, వేణు, తదితరులున్నారు.

తండ్రి చేతిలో కొడుకు హతం

ప్రజాశక్తి-విడవలూరు

తండ్రి చేతిలో కొడుకు హతమైన దారుణ ఘటన మండల పరిధిలోని ముదివర్తి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామంలో బిసి కాలనీకి చెందిన రవికుమార్ తన కొడుకు ప్రేమ్ కుమార్ (18) రాయితో కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడని పోలీసులు తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు.. ముదివర్తి గ్రామం బిసి కాలనీకి చెందిన రవికుమార్ తన కొడుకును మద్యం మత్తులో బండరాయితో తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినడని కుటుంబ కలహాలే హత్యకు కారణం అయి ఉంటుందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.నరేష్ అన్నారు.

టపాసుల పేలుళ్లలో మహిళ మృతి

ప్రజాశక్తి కోవూరు

కోవూరులో టపాసుల పేలుళ్ళ ఘటన మరొక ప్రాణాన్ని బలితీసుకుంది. సెప్టెంబర్ 4వ తేదీ అర్ధరాత్రి సత్రం వీధిలో వినాయక చవితి నిమజ్జనోత్సవ సందర్భంగా జరిగిన పేలుళ్లలో గాయపడిన కె.లక్ష్మీ (45) చెన్నైలోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఈ ప్రమాదంలో గాయపడిన మరో యువకుడు కె.లక్ష్మణ్ (25) గత సెప్టెంబర్ 14న చికిత్స పొందుతూ మృతి చెందగా, ఇప్పుడు లక్ష్మీ మృతి చెందడంతో ఈ ఘటనలో ఇప్పటివరకు ఇద్దరు ప్రాణాలు కోల్పోయినట్లు తేలింది. ఈ ఘటనపై కోవూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.


మాట్లాడుతున్న ఎఇఒ మునెమ్మ

యూరియా పంపిణీపై అవగాహన

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలోని కావలి ఎడవల్లి గ్రామంలో రైతులకు యూరియా పంపిణీ కార్డుకు సంబంధించిన వివరాల కొరకు అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో ఎఇఒ మునెమ్మ, ఎఇ సురేష్ బాబు తదితరులు మాట్లాడుతూ 2025 26 సీజన్‌కు యూరియా పంపిణీ సరఫరా చేయడానికి, వివరాలను పంట వివరాలను ముందుగానే నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ తెలుగు యువత అధ్యక్షులు మాల్యాద్రి నాయుడు, సచివాలయం సిబ్బంది, విఎఎ హేమంత్, రైతులు పాల్గొన్నారు.

In The Court of The III[rd] Addl. Junior Civil Judge : Nellore
O.S.No. 885 / 2021

Andhra Pragathi Grameena Bank,
Haranadhapuram Branch
Rep. by its **Branch Manager** - Plaintiff
Vs
Tupili Rama Mohan Reddy - Defendant

Notice to Defendant

Tupili Rama Mohan Reddy,
S/o **Dasradharami Reddy,**
R/o D.No.16/3/1239, 2nd Land,
Haranadhapuram, Nellore City.

పై నెంబరు కేసులో వాది మీమీద పై వారి కోర్టులో బ్యాంక్‌లోన్ బాకీ రాబట్టుకొనుటకు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే23-10-2025** దిన వాయిదా ఉన్నది. ఆరోజు **ఉదయం 10.30 గంIIలకు** మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

చుక్కా రమేష్
షేక్.రూహీ
ఎస్.సుధీర్
కె.కిశోర్
వాది తరపు అడ్వకేట్స్, నెల్లూరు.

పలుచోట్ల గాంధీజీకి నివాళులు



కావలిలో...

ప్రజాశక్తి-కావలి

కావలి పెన్షనర్స్ భవనంలో కావలి తాలూకా పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మహాత్మా గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రీల జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిరువురి చిత్రపటాలకు పూల మాలలువేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తాళ్లపాలెం ఆశానికేతన్ ఆశా నికేతన్‌కు వెళ్లి అచ్చట అనాథ బాలబాలికల సహాయార్థం రూ.10వేల చెక్కును విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఆకుల రమణయ్య, సహ అధ్యక్షుడు రవికుమార్, కార్యదర్శి జలజనాభయ్య, కోశాధికారి ఏపూరు వెంకయ్య, ఇంకా వరప్రసాదరావు, దుర్గాచారి, ఓసుధాకర్, ప్రభుదాసు, రోశయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మున్సిపల్ కార్యాలయంలో గాంధీ జయంతి పురస్కరించుకొని కమిషనర్ గంగా ప్రసాద్ గాంధీ చిత్రపటానికి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి మాట్లాడుతూ మహాత్మా గాంధీ అహింస మార్గంలో ఉద్యమం నుంచి బానిస సంకెళ్ల నుండి దేశానికి విముక్తి కలిగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోపారం వెంకట రమణమ్మ, మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, కుడుముల సుధాకర్ రెడ్డి, కౌన్సిలర్లు సూరా భాస్కర్‌రెడ్డి, మహబూబ్‌బాషా, పొడమేకల పెంచలయ్య, గౌస్‌బాషా, శివకోటారెడ్డి, వేణు, నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, కొప్పోలు చిన్నపరెడ్డి తదితరులున్నారు.

ప్రజాశక్తి-కోవూరు : మహాత్మా గాంధీ 186వ జయంతి ఉత్సవాలను కోవూరు జన విజ్ఞాన వేదిక, యుటిఎఫ్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం గాంధీ పార్క్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అహింసా సత్యాగ్రహాన్ని ఆయుధాలుగా మార్చుకుని గాంధీ దేశానికి స్వాతంత్ర్యం సాధించి పెట్టిన విధానం గురించి వివరించారు. చివరగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : భారతదేశం ఎప్పటికీ మరచిపోలేని వ్యక్తి గాంధీజీ అని, దేశానికి ఆయన చేసిన సేవ, త్యాగం వెలకట్టలేనివని ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ కరీముల్లా, తిరుమలాపురం సర్పంచ్ కృష్ణ, మాజీ ఎంపిటిసి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కరిముల్లా, తిరుమలాపురం సచివాలయంలో సర్పంచ్ కొలుబోయిన కృష్ణ మహాత్మా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగూర్‌బీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ షరీఫ్, మండల సిఒ ఇమ్రాన్, కార్యాలయం సిబ్బంది, కూటమి నేతలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు శాఖా గ్రంథాలయంలో గురువారం గాంధీ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



జెఎసి నాయకుల సమీక్ష సమావేశం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండల పరిధిలోని గుడిపాడు ఎస్‌టి కాలనీలో రాష్ట్ర దళిత, గిరిజన, బిసి, మైనార్టీ జెఎసి అధ్యక్షులు పాలకీర్తి రవి ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గుడిపాడు గ్రామ అధ్యక్షుడిగా ఎన్ వెంకటేష్‌ను, ఎఎస్ పేట మండల మైనార్టీ సభ్యులుగా షేక్ బి బి జాన్, కార్యవర్గ సభ్యులుగా ఎస్‌డి నాయబ్ రసూల్, బన్నీ, సులేమాన్ తదితరులను ఏకగ్రీవంగా నియమించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళిత గిరిజన మైనారిటీ కులాల అభివృద్ధి, సంక్షేమం కోసమే ఏర్పాటు చేసినదే ఈ జెఎసి అని, అందులో మీరందరూ భాగస్వామ్యులు కావడం ఎంతో సంతోషాదాయకమని, ఆయా కులాల్లో ఉన్న సమస్యలను తమ దృష్టికి, ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చి, పరిష్కరించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గ సభ్యులు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మాధవి, జెఎసి రాష్ట్ర చైర్మన్ సముద్రాల దావీదు, దళిత యూత్ అధ్యక్షుడు తుమ్మ వాసు, ఏఎస్ పేట మండల అధ్యక్షురాలు రజియా, ఆత్మకూరు మండల అధ్యక్షులు సంధాని, తదితరులు పాల్గొన్నారు.